అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి: ఎమ్మెల్యే బలాల

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బలాల, తదితరులు

సైదాబాద్, ఏప్రిల్ 18: అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను శుక్రవారం పాత బస్తీ పంజేషా లోని ఎమ్మెల్యే కార్యాలయంలో మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవికాలంలో జరిగే అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించినప్పుడే వాటి బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఆందోళన చెందకుండా, సమయస్ఫూర్తితో వ్యవహరించాలని, ఆస్తి ,ప్రాణ నష్టం జరగకుండా ఉండేందుకు ఉపయోగపడుతుందన్నారు. మలక్ పేట అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి అధికారి అంజిరెడ్డి మాట్లాడుతూ, అగ్నిమాపక వారోత్సవాలు ఈనెల 22 వరకు కొనసాగుతున్నాయని, ప్రమాదాలపై ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాపార, వాణిజ్య సముదాయంలో అగ్ని ప్రమాద నివారణ ఏర్పాట్లను ప్రతి ఒక్కరూ చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మలక్ పేట అగ్నిమాపక కేంద్రం అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ షైన్ షేక్

కందుకూరు, ఏప్రిల్ 18:పాడి రైతులు ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవా లని మండల పరిధిలోని రాచులూరు పశువైద్య డాక్టర్ ఎండి షైన్ షేక్ తెలిపారు. మండల పరిధిలోని మీర్ఖాన్ పేట గ్రామంలో నిర్వహించిన పశు వైద్య శిబిరంలో పశువులకు చికిత్స చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ముందస్తుగా టీకాలు వేయించుకున్నట్లయితే పశువులు ఆరోగ్యంగా ఉంటాయని తెలిపారు. గాలికుంటు వ్యాధి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎల్ఎస్ ఏగా నాగు నాయక్‌ను నియమించమని, అతడి సేవలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శివకుమార్, పాడి రైతులు పాల్గొన్నారు.

రాచకాల్వను కబ్జా చేసి కట్టిన

నిర్మాణాలను కూల్చివేయాలి

- వాటిపై త్వరలో హైడ్రాకు ఫిర్యాదు చేస్తాం
- శివారు కాలనీలకు డ్రైనేజీ ట్రంక్ లైన్ నిర్మాణం
- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

రాచకాల్వను జలమండలి అధికారులతో కలిసి పర్యటిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, ఏప్రిల్ 18 : సాహెబ్ నగర్ శివారులోని రాచకాలువను కబ్జా చేసి నిర్మించిన కట్టడాలను కూల్చివేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని శివారు కాలనీలో పర్యటించి రాచకాలువ స్థితి గతులను పరిశీలించారు. రాచకాలువ డ్రైనేజీ ట్రంక్ లైన్ నిర్మాణం కోసం రెవెన్యూ, ఇరిగేషన్, జలమండలి అధికారులతో కలిసి శివారు తూర్పు 21 కాలనీలలోని రాచకాలువ గుండా పర్యటించారు. 2023 ఎన్నికల ముందు ఈ డివిజన్ శివారు 21 కాలనీల డ్రైనేజీ లైన్ల కోసం దాదాపు 6 కోట్ల రూపాయలు మంజూరు చేసి శంకుస్థాపనలు చేశామన్నారు. శిలాఫలాకాలకే పరిమితం అవుతాయని, ఎన్నికల స్టంట్ అని అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కి, కార్పొరేటర్ లచ్చిరెడ్డి విమర్శించారన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన పనుల దగ్గర ఫొటోలు దిగి షో చేస్తున్నారని విమర్శించారు. డ్రైనేజీ ఔట్లెట్ పోయే దారి లేక పనులు జక్కిడి రామస్వామి రెడ్డి కాలనీ వరకే నిలిచి పోవడం జరిగిందిని, కార్పొరేటర్ లచ్చిరెడ్డి డ్రైనేజీ ఔట్లెట్ కోసం ప్రయత్నం చేయక పోగా మేమే డ్రైనేజీ పనులు ఆపుతున్నామని కాలనీలలో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. సంవత్సర కాలంగా డ్రైనేజీ ఔట్లెట్ కోసం మేము తీవ్ర ప్రయత్నం చేసి పురాతనమైన రాచ కాలువ గుర్తించి, ఈ కాలువ గుండా ట్రంక్ లైన్ వేద్దామని ప్రణాళిక చేస్తుంటే , కార్పొరేటర్ లచ్చిరెడ్డి రాచ కాలువ మీద అక్రమ కట్టడాలు ప్రోత్సహిస్తున్నాడని ఆరోపించారు. త్వరలోనే అందరి బండారాలు బయట పెడుతానని, రాచకాలువ పైన ఉన్న కట్టడాలన్నీ హైడ్రా దృష్టికి తీసుకువెళ్లి కూల్చివేయిస్తానని హెచ్చరించారు. తహసీల్దార్, సర్వేయర్, ఆర్.ఐ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా రాచకాలువ సర్వే మొత్తం పూర్తి చేశారని, రెండు మూడు రోజుల్లో మార్కింగ్ చేసి డ్రైనేజీ ట్రంక్ లైన్ ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, జలమండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, డీజీఎం రాజగోపాల్, మండల సర్వేయర్ జ్యోతి, ఇరిగేషన్ డీఈ, శుక్లజా, ఏఈ సతీష్, కాలనీ అధ్యక్షుడు మనోజ్ గౌరిశెట్టి, శ్రీశైలం, కృష్ణ, ఆవుల రమేష్, రాజు గౌడ్, సూర్యనాయక్, రామునాయక్, నర్సిరెడ్డి, లక్ష్మీపతి, కాలనీల నాయకులు దయాకర్, సంజీవరెడ్డి, యాదగిరిరాజు, సురేష్, శేఖర్, రవినాయకులు ముద్దగోని సతీష్ గౌడ్, దయాకర్ ముదిరాజ్, రషీద్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన సీపీ

వివరాలు తెలుసుకుంటున్న రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు

వనస్థలిపురం, ఏప్రిల్ 18: రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు శుక్రవారం సాయంత్రం వనస్థలిపురం పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, పోలీసు స్టేషన్లలో అధికారులు, సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించడానికి తనిఖీలు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ రికార్డులను పరిశీలించడంతో పాటు రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ వంటి పలు విభాగాల పనితీరు, సీసీటీవీల నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు. సమస్యాత్మక ప్రాంతాల సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

వనస్థలిపురం సీఐ శ్రీనివాస్ పూర్తి వివరాలను కమిషనర్‌కు వివరించారు. స్థానిక పోలీసుల పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

భవన నిర్మాణ కార్మికుల

సమస్యలను పరిష్కరించాలి

ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజు

రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజు

కందుకూరు, ఏప్రిల్ 18:బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ 4వ మహాసభల లను ఈనెల 21, 22 వ తేదీల్లో రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్టు ఏఐటీయూసీ కార్యవర్గ సభ్యుడు రాజు తెలిపారు. మండల కేంద్రంలో లేబర్ అడ్డా దగ్గర మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం రాజు మాట్లాడుతూ, దేశంలో నిర్మాణరంగం చాలా కీలకమైనదని తెలిపారు. ఈ రంగంలో దేశవ్యాప్తంగా 10 కోట్లకు పైగా కార్మికులు పని చేస్తున్నట్లు వివరించారు. నిర్మాణా రంగంలో పనిచేయు కార్మికులకు సమగ్రమైన సంక్షేమ చట్టాన్ని తీసుకురావాలని ఏఐటీయూసీ నాయకత్వాన నిర్వహించిన పోరాటాల ఫలితంగా 1996లో ఆనాటి యూడీఎఫ్ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని తీసుకువచ్చిందని గుర్తు చేశారు. 2014లో కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్పులు చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. కార్మికుల సంక్షేమ బోర్డును కొనసాగిస్తూ స్వతంత్రంగా పనిచేసే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రదర్శన ఉంటుందని, అనంతరం నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు . కార్యక్రమంలో శివ, నరసింహ, యాదయ్య, మనోహర్, రంజిత్, సుదర్శన్, కార్మికులు పాల్గొన్నారు.

బాల్య మిత్రుడికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న బాల్య మిత్రులు

కందుకూరు, ఏప్రిల్ 18: బాల్య మిత్రుడికి తోటి మిత్రులందరు ఆర్థిక సాయం చేశారు. మండల పరిధిలోని ఆకుల మైలారం జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో 1992 -93 వ సంవత్సరంలో 10వ తరగతి తమతో చదువుకున్న విద్యార్థి, బాల్య మిత్రుడు అనమోని రవీందర్ భార్యకు పక్షవాతం వచ్చి కుటుంబం ఇబ్బందులు పడుతుండగా అలనాటి మిత్రులు విషయం తెలుసుకొని చెయ్యి, చెయ్యి కలిపి రూ ,40 వేల రూపాయలను జమచేసి శుక్రవారం వారి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తోటి మిత్రుడిని ఆదుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఆపదలో ఉన్న వాడికి అండగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో మిత్రులు పొన్న అంజయ్య, అండేకర్ సురేందర్, సుభాష్ చంద్ర రెడ్డి, శ్రీనివాసు, వెంకటేశ్, నరసింహ, కన్నయ్య, కాశయ్య, ప్రభాకర్, నర్సింగ్, వెంకటేష్, శ్రీశైలం, కాజా మియా, నరసింహ , శ్రీనివాసు , వెంకటయ్య, గణేష్ పాల్గొన్నారు.

కాలనీ ఆర్చిని ప్రారంభించిన ఎమ్మెల్యే

డివిజన్ ఓంకార్ నగర్ కాలనీ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

వనస్థలిపురం, ఏప్రిల్ 18: వనస్థలిపురం డివిజన్ లోని ఓంకార్ నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన ముఖద్వారాన్ని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖద్వారాలు కాలనీ హుందాతనాన్ని సూచిస్తాయన్నారు. ప్రజలంతా ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కాలనీలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతని ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, లగ్గొని శ్రీధర్ గౌడ్, అబ్బన గోని అజయ్ యాదవ్, యాదగిరి సాగర్, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆర్కే పురం, ఏప్రిల్ 18 : యాదవ నగర్, ఆనంద్ నగర్, హయత్ నగర్, కల్వంచ, మదర్ డైరీ, సరూర్‌నగర్, అల్కాపురి, మోహన్ నగర్, చిత్రాలేఅవుట్, వీరభద్ర నగర్, వాసవీ కాలనీ, గ్రీన్ హిల్స్ కాలనీ, అష్టలక్ష్మి 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఈ దిగువ తెలిపిన ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు సరూర్‌నగర్ విద్యుత్ శాఖ డీఈ కే. కె రామకృష్ణ తెలిపారు. యాదవ నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 10:30 వరకు అల్కాపురి సాయిబాబా దేవాలయం, యాదవ నగర్, శ్రీకృష్ణ టెంపుల్ పరిసర ప్రాంతాలు. ఆనంద్ నగర్ ఫీడర్ పరిధిలో ఆనంద్ నగర్, సాయిబాబా దేవాలయం, తొర్రూర్ ఎక్స్ రోడ్ , సాయి పద్మావతి కాలనీ పరిసర ప్రాంతాలు. హయత్‌నగర్ ఫీడర్ పరిధిలో శ్రీనివాస కాలనీ, పద్మావతి కాలనీ, ఫాతిమా నగర్, శాంతివనం టౌన్షిప్, బాగ్‌హయత్ నగర్, నియర్ జి స్కూల్ పరిసర ప్రాంతాలు. కల్వంచ ఫీడర్ పరిధిలో కల్వంచ, శాంతినగర్, శారద నగర్ పరిసర ప్రాంతాలు. మదర్ డైరీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు దీర్ పార్క్, బాలాజీ నగర్, ఎల్లారెడ్డి కాలనీ, లెక్చరర్ కాలనీ పరిసర ప్రాంతాలు. సరూర్‌నగర్ ఫీడర్ పరిధిలో హుడా కాలనీ, చెరుకు తోట కాలనీ, పోచమ్మ బాగ్, వెంకటేశ్వర కాలనీ రోడ్ నెంబర్ 11 ,13 ,15 పరిసర ప్రాంతాలు. అల్కాపురి ఫీడర్ పరిధిలో అల్కాపురి, స్నేహపురి కాలనీ, ఆర్కే పురం పరిసర ప్రాంతాలు. మోహన్ నగర్ ఫీడర్ పరిధిలో మోహన్ నగర్ స్నేహపురి కాలనీ పరిసర ప్రాంతాలు. చిత్రలే అవుట్ ఫీడర్ పరిధిలో చిత్రలేఅవుట్, సిరి నగర్ కాలనీ పరిసర ప్రాంతాలు. వీరభద్ర నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 11:30 గంటల వరకు శుభోదయం కాలనీ, సూర్య నగర్, సుబ్రహ్మణ్య నగర్, పుకట్ నగర్, వీరభద్ర నగర్ పరిసర ప్రాంతాలు, వాసవీ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వాసవీ కాలనీ , ఆర్కేపురం, గ్రీన్ హిల్స్ కాలనీ పరిసర ప్రాంతాలు. గ్రీన్ హిల్స్ కాలనీ ఫీడర్ పరిధిలో గ్రీన్స్ కాలనీ, కృష్ణానగర్, మోయ నగర్, ద్వారకా నగర్ పరిసర ప్రాంతాలు. అష్టలక్ష్మి ఫీడర్ పరిధిలో సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు అష్టలక్ష్మి దేవాలయం, వాసవీ కాలనీ పరిసర ప్రాంతాలు.

వాకర్స్ క్లబ్ కమిటీ ఎన్నిక

సురేష్ బాబు

విజయ్ భాస్కర్

సైదాబాద్, ఏప్రిల్ 18: ఇంటర్ నేషనల్ వాకర్స్ క్లబ్ హైదరాబాద్ 301 మలక్ పేట్ బి.బ్లాక్స్‌లోని స్వాన్ వాకర్స్ క్లబ్ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ప్రొఫెసర్ సురేష్‌బాబు, ఉపాధ్యక్షులుగా బి.గంగాధర్, పద్మాల శంకర్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్.ఎస్. విజయ భాస్కర్, కోశాధికారిగా వేణు, ప్రచార కార్యదర్శి (పీఆర్ఓ)గా ఎం.సత్యనారాయణ, జాలి వాకర్‌గా ప్రకాష్ రెడ్డి, సలహా దారులుగా పాల మధుసూదన్, డైరెక్టర్లుగా ఎస్.సూర్యప్రకాష్, కళ్ళెం రాజశేఖర్ రెడ్డి, మల్లారెడ్డి, జనార్ధన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా లగుశెట్టి విజయ్ కుమార్, మాణిక్ ప్రభును ఎన్నుకున్నారు. కమిటీ ఎన్నికల పరిశీలకులుగా ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ హైదరాబాద్ జిల్లా 301 మాజీ గవర్నర్ చక్రపాణి, హైదరాబాద్ జిల్లా న్యాయ వాదుల సంఘం క్రిమినల్ కోర్ట్స్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ చారి, గవర్నర్ గంగాధర్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో మాతా శ్రీనివాస్, వెంకటయ్య, సుభాష్, సుధాకర్ పాల్గొన్నారు.

భారీ వర్షానికి కూలిన చెట్లు..

విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

సైదాబాద్ కాలనీలోని గాంధీ పార్క్ వద్ద విద్యుత్ తీగలపై కూలిన భారీ వృక్షం.. ధ్వంసం అయిన కారు..

సైదాబాద్, ఏప్రిల్ 18: ఈదురు గాలులు, గాలి దుమారంతో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. మలక్ పేట, యాకుత్‌పుర నియోజకవర్గ పరిధిలో ప్రాంతాల్లో 36.8 మిల్లీ మీటర్ల భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి తీవ్రంగా ఉన్న ఎండ తీవ్రత ఒక్కసారిగా తగ్గి వాతావరణం అంతా చీకటిగా మారిపోయింది. శుక్రవారం సాయంత్రం ఆకస్మాత్తుగా కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలపాతంగా కనిపించాయి. పలు ప్రాంతాల్లో వరద నీటి మూలంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఈదురుగాలులు బలంగా వేయడంతో పలుచోట్ల చెట్లు నేలకు ఒరిగాయి. సైదాబాద్ కాలనీలోని గాంధీ పార్క్ వద్ద ఓ భారీ వృక్షం కూలిపోయి కారుపై, విద్యుత్ స్తంభం పై పడటంతో విద్యుత్ స్తంభం విరిగి పోవడంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. ఆస్మాన్ ఘడ్ సబ్ డివిజన్ పరిధిలోని వర్షం కారణంగా అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిలిచిపోవడంతో మలక్ పేట అక్షయ టిఫిన్ సెంటర్, మలక్ పేట రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రయాణికులు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కొత్త చట్టంతో భూ వివాదాలు పరిష్కారం

- కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 18 : నూతన ఆర్ఓఆర్ చట్టం భూ వివాదాల పరిష్కారాలను సరళతరం చేయడానికి దోహద పడుతుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, రైతులు, రైతు సంఘాలు, ప్రభుత్వేతర సంస్థలకు సంబంధించిన భూ వివాదాల సత్వర పరిష్కారానికి 'భూ భారతి' అవగాహన సదస్సులు ఉపయోగపడతాయన్నారు. భూభారతి చట్టంలోని నిబంధనలపై అవగాహన తీసుకురావడానికి, సేవలను విస్తరించడానికి పౌరులు, రైతులు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులతో అవగాహన సదస్సులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ముందుగా మండల స్థాయిలో ఈ నెల 19 నుంచి 26 వరకు ఈ అవగాహన సదస్సులు నిర్వహించనున్న ట్టు తెలిపారు. ఇందులో భాగంగా 19న మూడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామంలో ఉదయం 10.30 గంటలకు అవగాహన సదస్సు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. రైతులు, ఇతర సంఘాల ప్రతినిధులు పాల్గొనాలని కలెక్టర్ సూచించారు.

కంప్యూటర్ సైన్స్‌లో చెరుకు ప్రభాదేవికి డాక్టరేట్

ప్రభాదేవికి డాక్టరేట్ ప్రదానం చేస్తున్న ఓయూ ఇంజినీరింగ్ అధికారులు

సికింద్రాబాద్, ఏప్రిల్ 18: ప్రతిష్ఠాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ నుంచి ఐటీ విభాగంలో చెరుకు ప్రభాదేవికి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ప్రొఫెసర్ వీబీ నరసింహ పర్యవేక్షణలో 'ఐడెంటిటీ అండ్ యాక్సెస్ మేనేజ్‌మెంట్ ఇన్ పబ్లిక్ క్లౌడ్ ఫ్రేమ్ వర్క్స్' అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు గాను ఉస్మానియా యూనివర్సిటీ గెజిట్ ద్వారా ప్రభాదేవికి డాక్టరేట్ ప్రకటించారు. చిన్ననాటి నుంచే చదువులో చురుకుగా ఉండే ప్రభాదేవి ఉన్నత ఆశయంతో పీహెచ్‌డీలో ప్రవేశం పొంది తన లక్ష్యాన్ని పూర్తి చేశారు. సూర్యాపేట జిల్లా, తిరుమలగిరి మండలం, తాటిపాముల గ్రామానికి చెందిన ప్రభాదేవిది వ్యవసాయ కుటుంబం. తండ్రి చెరుకు సోమయ్య ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ డైరెక్టర్. తల్లి కలమ్మ గృహిణి. ఓయూ నుంచి డాక్టరేట్ సాధించడం పట్ల అధ్యాపకులు భర్త దాసరి నారాయణ, సోదరుడు చెరుకు యాకస్వామి, మిత్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమెను ఓయూ ప్రొఫెసర్లు, కోస్కాలర్స్ ఘనంగా సన్మానించారు. ప్రభాదేవి మాట్లాడుతూ, పీహెచ్‌డీ సాధించేందుకు సహకరించిన గైడ్ ప్రొఫెసర్ వీబీ నరసింహ, హెచ్ఓడీ పీవీ సుధ, ప్రొఫెసర్ శ్యామల, ప్రొఫెసర్ వెంకటదాస్, గురువులకు, జన్మనిచ్చిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

వేసవిలో ప్రతి ఒక్కరి దాహార్తిని తీర్చాలి : రాగిడి



ఉప్పల్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి

ఉప్పల్, ఏప్రిల్ 18 : బీఆర్ఎస్ ఉప్పల్ డివిజన్ నాయకుడు పిల్లి నాగరాజు ఆధ్వర్యంలో ఉప్పల్ విద్యుత్ కార్యాలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. శుక్రవారం మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని చలివేం ద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాగిడి మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

కార్యక్రమంలో పార్టీ డివిజన్ సీనియర్ నాయకులు ఉమారెడ్డి, సంతోష్, మహేందర్‌రెడ్డి, సాయి, జగన్, రంగ భాస్కర్, ప్రభాకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

My client Smt. G. Haritha W/o. G. Dhanaraj, R./o. 2-111, Injapur Village, Abdullapurmet Mandal, R.R. District, purchased plot Bearing No.28 of an extent of 342 sq., yards in Sy. No.60 part situated in Karmanghat Village, Saroor Nagar Mandal from 1. Mashu Ben shah, W/o Late Nandu bhai, R/o sheetal, 203, A-Wing, J. P. Road, Seven Banglow, Andheri West, Mumbai, 2. Govind Das, S/o Parmananda Das, R/o Hotel Haridwar, Esamia Bazar, Hyderabad and 3. K. Vishwanadha Sharma, K. Narasimiah, R/o 1-7-172; Esamia Bazar; Hyderabad . Smt. G. Haritha purchased from M. Srinivas Reddy, S/o M. Ram Reddy, R/o H.No: 8-6116; Hasthinapura, East, Vanasthalipuram. 1. Mashu Ben shah, W/o Late Nandu bhai, R/o Sheetal, 203, A-Wing, J.P. Road, Seven Banglow, Andheri West, Mumbai, 2. Govind Das, s/o Parmananda Das, R/o Hotel Haridwar, Esamia Bazar, Hyderabad and 3. K. Vishwanadha Sharma, K. Narasimiah, R/o 1-7-172; Esamia Bazar; Hyderabad under registered Sale Deed bearing No.7556/1993, dt: 27-07-1993. My client while travelling lost its link document bearing No. 7556/1993, dt: 27-07-1993 during transit. In this regard my client lodged a complaint to police and police advised my client to issue paper publication. My client request the person who found the above said document may kindly handover to under sign. Hence this notice is issued to all public that if anybody does any transaction it is not binding on my client as this notice.

Hyderabad,
19-04-2025

Sd/- **S.KRISHNA MOHAN**
Advocate
Plot No: 45; Road No: 4; Hanuman Nagar; Opp. G.S.I. Trining Institute; Mansurabad; Hyderabad-68.
Cell: 9704224493 & 7989895566

తవ్వారు.. వదిలేశారు...

- గాయాల పాలవుతున్న ద్విచక్రవాహనదారులు
- రాకపోకలకు అవస్థలు
- ప్రజల ఇబ్బందులు

సరూర్‌నగర్ బస్టాప్ పక్క కాలనీలో తవ్వి వదిలిన రోడ్డు దుస్థితి

ఆర్కే పురం, ఏప్రిల్ 18 : అధికారుల నడుమ సమన్వయ లోపం స్థానికుల పాలిట శాపంగా మారింది. రాకపోకలకు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా కాలనీలోని రోడ్లను తవ్వి నూతన రోడ్లను వేస్తామని చెప్పి ఉన్న రోడ్లను తవ్వి తరువాత పట్టించుకోకపోవడంతో రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వివరాల్లోకి వెళితే సరూర్‌నగర్ బస్టాప్ పక్క కాలనీలో గత మూడు నెలల క్రితం అభివృద్ధి పేరుతో కాలనీలోని రోడ్డును తవ్వి వదిలేశారు. అయితే ప్రస్తుతం ఈ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. జరుగుతున్న పనులు కూడా నత్త నడకన సాగుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు రాకపోకలకు అనేక అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా ద్విచక్ర వాహనదారులు తవ్వి వదిలిన రోడ్డుపై ప్రయాణిస్తూ అదుపుతప్పి కిందపడి గాయాల పాలవుతున్నారు. అధికారులు, కాంట్రాక్టర్ రోడ్డు పనులు చేపట్టకుండా కాలయాపన చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఇలా ఎంతకాలమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. త్వరిత గతిన రోడ్డు వేస్తే రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రయాణం చేసేందుకు వీలుంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. లేకుంటే నిత్యం ప్రమాదాల బారిన పడి గాయాల పాలవడం తప్పదని తెలుపుతున్నారు. అంతేకాకుండా వర్షం పడ్డప్పుడు కాలనీ రోడ్లు మొత్తం చిత్తడి చిత్తడిగా మారుతున్నాయన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులను ఫోన్లో సంప్రదిస్తే ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. స్థానిక కార్పొరేటర్‌ను సంప్రదిస్తే కాంట్రాక్టర్ వల్ల పనులు లేట్ అవుతున్నాయని, త్వరలోనే రోడ్డు పనులు చేయిస్తామని చెప్పి నెల రోజులు నడుస్తున్నా, ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రోడ్డు పనుల నిమిత్తం తవ్విన రోడ్డుతో పాటు డ్రైనేజీలపై మూతలను తొలగించడంతో రాత్రి సమయంలో తీవ్రమైన దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల బెడద తీవ్రంగా మారిందని స్థానికులు తెలిపారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన రోడ్డు పనులు చేపట్టి, ప్రజలను ప్రమాదాల బారి నుండి కాపాడాలని కోరుతున్నారు.